# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

మంగళవారం 28, జులై 2026




## తిర్యానిలో గంజాయి స్వాధీనం

### 9 మంది నిందితుల అరెస్టు

**తిర్యాని, జులై 27, ప్రభాతవార్త**

తిర్యాని మండలంలో 170 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని తొమ్మిది మంది నిందితులను అరెస్టు చేసినట్టు తిర్యాని ఎస్సై సుబ్బారావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం ఆదివారం తిర్యాని పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురు వ్యక్తులను ఆపి తనిఖీ చేయడం జరిగిందన్నారు. వారిలో సుంగాపూర్ గ్రామానికి చెందిన మిడిదొడ్డి కృష్ణ, దుర్గం ప్రశాంత్, ఉల్లిపిట్ట గ్రామానికి చెందిన ముంజం భరత్ గంజాయి విక్రయానికి పాల్పడుతున్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. వారిని విచారించగా తాము గంజాయి సేవించడంతో పాటు మరికొందరికి విక్రయిస్తున్నట్లు తెలిపడం జరిగిందన్నారు. వారి ద్వారా సుంగాపూర్ గ్రామానికి చెందిన మల్కాడి కృష్ణ, ముంజం శ్రీరామ్, బొర్లకుంట కృష్ణంరాజు, దుర్గం జీవన్, అలాగే మిగతా 2లో..

## ప్రజావాణి దరఖాస్తుల్లో ఆలస్యం వద్దు

**✻ చిట్యాలలో విత్తన మేళా ప్రారంభం.. ✻ పంటమార్పిడి అవలంబించాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచన**


**నిర్మల్, జులై 27, ప్రభాతవార్త**



ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో ఎలాంటి ఆలస్యం చేయవద్దని నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో భాగంగా సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి స్వయంగా అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని సూచించారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ ప్రజావాణిలో ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలపై దరఖాస్తులు అందజేశారు. చిట్యాలలో విత్తన మేళా ప్రారంభంఅనంతరం నిర్మల్ రూరల్ మండలం చిట్యాల గ్రామంలోని రైతు వేదికలో నిర్వహించిన జిల్లా స్థాయి విత్తన మేళాను కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. స్టాళ్లను పరిశీలించి రైతులకు పత్తి, కూరగాయల నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులు తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటలు, ఉద్యానవన పంటలు, కూరగాయల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగు దీర్ఘకాలికంగా లాభదాయకమని, జిల్లాలో ఈ ఏడాది 1,600 ఎకరాల లక్ష్యానికి గానూ 1,670 ఎకరాలకు స్పందన లభించిందని, వచ్చే ఏడాది 5,000 ఎకరాల్లో విస్తరించాలని ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. రైతులు నేల పరీక్షల ఆధారంగానే ఎరువులు వాడాలని, భూసారాన్ని కాపాడేందుకు నానో యూరియా వినియోగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రమణ, సర్పంచ్ సుప్రియ, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## ప్రతి ఫిర్యాదును చట్టపరంగా పరిశీలించి చర్యలు తీసుకుంటాం

**✯ జిల్లా ఎస్పీ నితికా పంత్**



**ఆసిఫాబాద్, జులై 27, ప్రభాతవార్త :**

ప్రతి ఫిర్యాదును చట్టపరంగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ నితికా పంత్ సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను విని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఫిర్యాదును చట్టపరంగా పరిశీలించి తగిన విధంగా పరిష్కరించేందుకు సంబంధిత పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా సంబంధిత పోలీసు స్టేషన్‌ల అధికారులతో చరవాణి లో మాట్లాడి ఫిర్యాదుల స్థితిగతులను తెలుసుకుని త్వరితగతిన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలు ఎలాంటి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నిర్భయంగా తమ సమస్యలను పోలీసు శాఖ దృష్టికి తీసుకురావాలని, పరిష్కారం అందించేందుకు జిల్లా పోలీసు శాఖ కట్టుబడి ఉందని ఎస్పీ తెలిపారు. ప్రజలకు పోలీసు సేవలు మరింత చేరువ కావడం, వారి సమస్యలను వేగంగా పరిష్కరించడం, శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ కోరారు.



## ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

**✪ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**నస్పూర్, జూలై 27, ప్రభాతవార్త**

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. తాండూరు మండలం అచలాపూర్ గ్రామానికి చెందిన ఆముర్ల కృష్ణ తనకు ఆర్థిక స్తోమత లేదని, తన పిల్లలకు జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలలో సీటు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కన్నెపల్లి మండల కేంద్రానికి చెందిన గాండ్ల మల్లేష్, గాండ్ల తిరుపతి తమ తాతల నుండి వస్తున్న భూమిని కొందరు అక్రమంగా పట్టా చేయించుకున్నారని, ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి దొంగ పట్టాను రద్దుచేసి తమ పేరిట పట్టా చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. లక్షెట్టిపేట మండలం కొత్తూరు గ్రామానికి చెందిన సురిమిల్ల పెద్దయ్య తన పేరిట గ్రామ శివారులో ఉన్న భూమి విస్తీర్ణం ఆన్ లైన్ లో తక్కువగా నమోదు అయిందని, వివరాలను పరిశీలించి సవరించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మందమర్రి మండల కేంద్రానికి చెందిన కె.కృష్ణవేణి తాను గురుకుల పాఠశాలలలో హెల్త్ సూపర్వైజర్ గా పనిచేస్తున్నానని, ఈ సంవత్సరం ఆటో రెన్యువల్ చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. భీమిని మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన ముత్తినేని రాజేశం ప్రమాదంలో గాయపడి వెన్నుపూస దెబ్బతిందని, తనకు బండి ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మందమర్రి మండలం పులిమడుగు గ్రామానికి చెందిన బానోత్ రాజు తాను దివ్యాంగుడిని అని, తనకు తెలియకుండా తన భూమిని నకిలీ పత్రాల మిగతా 2లో..

### జిల్లాకు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కోర్టు

## మంజూరుకు కృషి చేస్తా

**✻ కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి**

**ఆసిఫాబాద్ టౌన్, జూలై 27, ప్రభాతవార్త :**

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కోర్టు ఏర్పాటుకు కృషి చేస్తానని జిల్లా జడ్జి శారదాదేవి హామీ ఇచ్చారు. కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా మహబూబ్‌నగర్ నుంచి పదోన్నతిపై బదిలీ అయిన శారదాదేవి సోమవారం బాధ్యతలు స్వీకరించిన



సందర్భంగా ఆసిఫాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ జిల్లాకు నూతన 10+2 కోర్టులు, ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు మంజూరు అయ్యేలా తన వంతు కృషి చేస్తానని హామీ మిగతా 2లో..

# తిర్యానిలో గంజాయి స్వాధీనం

(మొదటిపేజీ తరువాయి)

ఉల్లిపిట్ట గ్రామానికి చెందిన వైరగాడి పుష్పరాజ్, చినార్కర్ నితిన్, బొర్లకుంట సాయికుమార్ వివరాలు తెలియడంతో వారిని కూడా అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. మొత్తం 9 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్న వారి వద్ద నుండి 170 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని, సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగం, విక్రయం, రవాణాపై తిర్యాని పోలీసులు నిరంతరం ప్రత్యేక నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ప్రజలు తమ పరిసరాల్లో గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలకు సంబంధించిన చట్టవిరుద్ధ కార్యకలాపాల గురించి సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని కోరారు. ఆసిఫాబాద్ జిల్లా డీఎస్పీ అశోక్ ఆదేశాల మేరకు జిల్లాలో గంజాయి వినియోగం, విక్రయం, రవాణా ఇతర మత్తు పదార్థాలకు సంబంధించిన నేరాలపై ప్రత్యేక దృష్టి సారించి, చట్టాన్ని ఉల్లంఘించే వారిపై ఎటువంటి రాజీ లేకుండా కఠిన చర్యలు కొనసాగుతాయని ఎస్సై తెలిపారు.

# జిల్లాకు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కోర్టు మంజూరుకు కృషి చేస్తా

(మొదటిపేజీ తరువాయి)

ఇచ్చారు. గత ఆరు నెలలుగా ఇన్‌చార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా సేవలందించిన మంచిర్యాల ప్రథమ జిల్లా జడ్జి వీరయ్యకు ఆత్మీయ వీడ్కోలు పలికారు. అనంతరం నూతన జిల్లా ప్రధాన న్యాయమూర్తి శారదాదేవి, ఇన్‌చార్జి జిల్లా జడ్జి వీరయ్యలను బార్ అసోసియేషన్ తరపున శాలువాలతో ఘనంగా సత్కరించి, అయోధ్య శ్రీరామ మందిర జ్ఞాపికతో పాటు మొక్కలను అందజేశారు. అంతకుముందు సీనియర్ సివిల్ జడ్జి సాంకేత్ మిత్ర మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లా కోర్టుల్లో ఆసిఫాబాద్ బార్ అగ్రస్థానంలో నిలిచి ఇతరులకు ఆదర్శంగా ఉండాలని ఆకాంక్షించారు. జూనియర్ సివిల్ జడ్జి జక్కుల అనంతలక్ష్మి మాట్లాడుతూ ఆసిఫాబాద్ బార్‌కు మంచి పేరు ఉందని, ఇక్కడ కేసుల పరిష్కారాల సంఖ్య కూడా అధికంగా ఉంటుందని పేర్కొన్నారు. బార్–బెంచ్ మధ్య ఉన్న సత్సంబంధాలు భవిష్యత్తులోనూ ఇదే విధంగా కొనసాగాలని ఆమె ఆకాంక్షించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బోనగిరి సతీష్ బాబు మాట్లాడుతూ కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాకు 10+2 కోర్టు భవనం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ ప్రత్యేక కోర్టు మంజూరు చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు టి. సురేష్, ఎం. సురేష్, నీకోడే రవీందర్, నరహరి, డి. వెంకటేశ్వర్లు, జగన్మోహనరావు, రవీందర్ రెడ్డి, జూనియర్ న్యాయవాదులు, న్యాయవాదుల గుమస్తాల సంఘం ప్రతినిధులు శివ చందు, ముక్రం ఖాన్, సిడం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

(మొదటిపేజీ తరువాయి)

ఆధారంగా అక్రమ రిజిస్ట్రేషన్లు చేశారని, ఈ విషయమై విచారించి తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మందమర్రి మండలం రామకృష్ణాపూర్ ప్రాంతానికి చెందిన రవికుమార్ తాను, తన భార్య దివ్యాంగులమని, నిరుపేద అయిన తమకు రెండు పడక గదుల ఇల్లు ఇప్పించి అంత్యోదయ కార్డు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జన్నారం మండలం పొనకల్ గ్రామానికి చెందిన దుమల్ల అరుణ్ కుమార్ తన తండ్రి గ్రామ రెవెన్యూ సహాయకుడిగా విధులు నిర్వహిస్తూ మరణించారని, కారుణ్య నియామకం క్రింద తనకు ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంకు ఘన నివాళులు

**నిర్మల్, జులై 27, ప్రభాతవార్త:**



భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ శాస్త్రవేత్త, మిసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతిని నిర్మల్ జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనంలో ఈ కార్యక్రమం జరిగింది. సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు మొహమ్మద్ అజహరుద్దీన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర రిటైర్డ్ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు కె. రమేష్ ముఖ్య అతిథిగా హాజరై కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. డాక్టర్ కలాం దేశ రక్షణ, విజ్ఞాన శాస్త్రం, విద్యారంగాలకు అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. సామాన్య కుటుంబం నుంచి దేశ అత్యున్నత రాష్ట్రపతి పదవికి ఎదిగిన ఆయన జీవితం నేటి యువతకు మార్గదర్శకమని పేర్కొన్నారు. కలలు కనాలని, వాటిని సాకారం చేసుకునేందుకు నిరంతరం శ్రమించాలని కలాం ఇచ్చిన సందేశాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులుగా తెలంగాణ ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ సభ్యుడు స్వదేశ్, మాజీ కౌన్సిలర్ షేక్ సయీద్, షేక్ ఇంతియాజ్ అహ్మద్, మొహమ్మద్ మిన్హాజ్, మీర్జా షోయేబ్ బేగ్, హనుమంత్ రెడ్డి, పోతన్న, తయ్యబ్ చౌష్ పాల్గొన్నారు. అలాగే సొసైటీ ప్రతినిధులు షేక్ ఖలీల్, సయ్యద్ ముజాహిద్ అలీ, అబ్దుల్ వాజిద్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. సభ ముగింపులో డాక్టర్ కలాం స్మృత్యర్థం రెండు నిమిషాల పాటు మౌనం పాటించి నివాళులర్పించారు.

# సింగరేణి విశ్రాంత కోల్ మైన్స్ పెన్షన్ దారులకు బీమా సౌకర్యాలు కల్పించాలి

**- సింగరేణి విశ్రాంత కార్మికుల సంఘం అధ్యక్షుడు గజ్జెలి వెంకటయ్య**

**తాండూర్, జులై 27, ప్రభాతవార్త :**



సింగరేణి విశ్రాంత కోల్ మైన్స్ పెన్షన్ దారులకు బీమా సౌకర్యాలు కల్పించాలని సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గజ్జెల్లి వెంకటయ్య డిమాండ్ చేశారు. తాండూర్ మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ ఎదుట సోమవారం సంఘం ఆధ్వర్యంలో సింగరేణి విశ్రాంత ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి ధర్నా నిర్వహించారు. అనంతరం యూనియన్ బ్యాంక్ మేనేజర్ నిశంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గజ్జెల్లి వెంకటయ్య మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యంతో యూనియన్ బ్యాంక్ యజమాన్యం 262 2024లో చేసుకున్న ఒప్పందం మేరకు యూనియన్ బ్యాంకు లో ఖాతాలు కలిగి ఉన్న 70 సంవత్సరాలు లోపు పెన్షన్ దారులకు రూ.30 లక్షల ప్రమాదానికి, రూ.10 లక్షలు సహజ మరణానికి బీమా సౌకర్యం కల్పించాల్సి ఉందన్నారు. గత రెండు సంవత్సరాల నుండి భీమ అమలు చేయడంలో యూనియన్ బ్యాంక్ యజమాన్యం నిరక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఖాతాలు కలిగి ఉన్న విశ్రాంతి బొగ్గు పెన్షన్ దారులకు యూనియన్ బ్యాంక్ యాజమాన్యం వెంటనే బీమా సౌకర్యం కల్పించాలని లేనియెడల భవిష్యత్తులో జిల్లా వ్యాప్తంగా యూనియన్ బ్యాంకు కార్యాలయాల ముందు సింగరేణి విశ్రాంత కార్మికుల కుటుంబాలతో శాంతియుతంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టుతామన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి విశ్రాంత కార్మికులు అసం రాజయ్య, తగరం రాజన్న, తోటపెల్లి ఎల్లయ్య, దేవరకొండ మొగిలి, దుర్గస్వామి, లక్ష్మి, ఎర్రయ్య, రాయలింగు, ఎడ్ల గొంతయ్య, తదితరులు పాల్గొన్నారు.

# కౌట గ్రామంలో తీవ్ర విషాదఛాయలు

**- బాసర మాజీ ఎంపీపీ సోలంకి బాబురావు**

**పటేల్ గుండెపోటుతో మృతి**

**భైంసా, జులై 27, ప్రభాతవార్త:**



నిర్మల్ జిల్లా బాసర మండల పరిధిలోని కౌట గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. బాసర మాజీ ఎంపీపీ, సీనియర్ నాయకుడు సోలంకి బాబురావు పటేల్ (50) సోమవారం మధ్యాహ్నం 1:30 గంటలకు గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. ఆయన ఆకస్మిక మరణంతో బాసర మండలవ్యాప్తంగా శోకసంద్రం అలుముకుంది. సుదీర్ఘంగా 20 ఏళ్లకు పైగా రాజకీయాల్లో కొనసాగిన బాబురావు పటేల్, ప్రజాసేవలో తనదైన ముద్ర వేశారు. మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డికి అత్యంత ఆప్తుడిగా, నమ్మిన బంటుగా ఉన్నారు. కౌట గ్రామానికి మూడుసార్లు సర్పంచ్‌గా సేవలు అందించిన ఆయన, ఆ తర్వాత బాసర మండల ఎంపీపీగా బాధ్యతలు నిర్వహించారు. తదనంతరం సర్పంచ్ స్థానం మహిళకు రిజర్వ్ కావడంతో ఆయన భార్య సుశీల పోటీ చేసి గెలుపొందారు. ప్రస్తుతం ఆమె సర్పంచ్‌గా కొనసాగుతున్నారు. ఆపదలో ఉండి అన్నా అని పిలిస్తే తక్షణమే స్పందిస్తూ ప్రజల ఆదరాభిమానాలు పొందిన నాయకుడు అర్ధాంతరంగా తనువు చాలించడంతో బాసర మండల ప్రజలు, గ్రామస్తులు కన్నీరుమున్నీరవుతున్నారు.

# ఉన్నత విద్యే విజయానికి బలమైన పునాది: బోర్లకుంట వెంకటేష్ నేత

**- ప్రభుత్వ బాలుర పాఠశాల పదో తరగతి విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ**

**మంచిర్యాల, జూలై 27, ప్రభాతవార్త**



విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఉన్నత విద్యే బలమైన పునాదిగా నిలుస్తుందని పెద్దపల్లి మాజీ ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత అన్నారు. రఘునాథ్ వెరబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంచిర్యాల ప్రభుత్వ బాలుర పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పాఠశాల సంచులు, నోట్ పుస్తకాలు, గణిత పరికరాల పెట్టెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థుల జీవితాన్ని మలిచే కీలక దశ అని, ఈ దశలోనే లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధనకు కృషి చేయాలని సూచించారు. అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రఘునాథ్ వెరబెల్లి, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చంద్రుపట్ల సునీల్ రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గాజుల ముఖేష్ గౌడ్, రంగ శ్రీశైలం, వంగపల్లి వెంకటేశ్వర్ రావు, బోట్ల సత్యం, కమలాకర్ రావు, తరుణ్ సింగ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బండి రమేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్పత్తి వ్యయం తగ్గింపు, మ్యాన్ పవర్ యూటిలైజేషన్‌లో శ్రీరాంపూర్ ఏరియా ఆదర్శంగా నిలవాలి

**నస్పూర్, జూలై 27, ప్రభాతవార్త**



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్

ఉత్పత్తి వ్యయం తగ్గింపు, మ్యాన్ పవర్ వినియోగంలో శ్రీరాంపూర్ ఏరియా సింగరేణిలోనే ఆదర్శంగా నిలవాలని ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ ఆకాంక్షించారు. సోమవారం కార్పొరేట్ జీఎం (ఎఫ్ అండ్ ఏ, ఇంటర్నల్ ఆడిట్) సీహెచ్. మురళీధర్ శ్రీరాంపూర్ ఏరియాను సందర్శించిన సందర్భంగా ఆయనను జీఎం శాలువాతో సత్కరించారు. అనంతరం అన్ని గనులు, విభాగాల అధిపతులతో ఆడిట్ రికవరీలు, నిధుల వినియోగంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేట్ జీఎం సీహెచ్. మురళీధర్ మాట్లాడుతూ గనుల్లో 100 శాతం మ్యాన్ పవర్ వినియోగం జరిగేలా చూడాలని, సర్ఫేస్ డిస్ప్లేస్‌మెంట్ ఉద్యోగుల రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. సర్ఫేస్‌లో విధులు నిర్వహించిన రోజులకు అండర్ గ్రౌండ్ అలవెన్సులు చెల్లించకుండా చూడాలని, ఒకవేళ చెల్లిస్తే వెంటనే రికవరీ చేయాలని స్పష్టం చేశారు. కార్పొరేట్ సూచనలను ఏరియా వ్యాప్తంగా కచ్చితంగా అమలు చేయాలని జీఎం మునిగంటి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం కృష్ణ ప్రసాద్, ఏజీఎం సుమలత, ఎస్సార్పీ ఓసీ పీఓ సిహెచ్. వెంకటేశ్వర్లు, డీజీఎం(పర్సనల్) ఎస్. అనిల్ కుమార్, డీజీఎం (ఇంటర్నల్ ఆడిట్) దామోదర్ రావు, ఆర్.కె గ్రూప్ ఏజెంట్ ఎన్. శ్రీధర్, ఎస్సార్పీ గ్రూప్ ఏజెంట్ రవికుమార్, ఐకే ఓసీ ఇంఛార్జ్ పీఓ నాగన్న, డీజీఎం (స్టోర్స్) మల్లయ్య, డీవై పీఎం క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గోమాతకు జాతీయ మాత హోదా కల్పించాలని కలెక్టర్‌కు వినతిపత్రం

**- డెబ్బై వేల సంతకాలతో గోమాత సన్మాన్ ఆహ్వాన్ అభియాన్ విజయవంతం**

**మంచిర్యాల,జులై 27,ప్రభాతవార్త :**



మంచిర్యాల జిల్లా మందమర్రి మండలంలోని కామాఖ్య ఆలయంలో గో సంరక్షణకు మద్దతుగా నిర్వహించిన గోమాత సన్మాన్ ఆహ్వాన్ అభియాన్ సంతకాల సేకరణ కార్యక్రమం ఘన విజయాన్ని సాధించిందని, గోమాతకు జాతీయ మాత హోదా కల్పించాలని కోరుతూ సేకరించిన డెబ్బై వేల సంతకాల పత్రాలను జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కామాఖ్య ఆలయ నిర్వాహకులు, ప్రధాన అర్చకులు భవాని సతీష్ మాట్లాడుతూ గోవు భారతీయ సంస్కృతి, సనాతన ధర్మానికి ప్రతీక అని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే గోమాతను జాతీయ మాతగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. గోవు బ్రతికితేనే భూమి బ్రతుకుతుంది... భూమిపై మానవ జీవనం కొనసాగాలంటే గో సంరక్షణ తప్పనిసరి అని ఆయన ఉద్బోధించారు. గో ఉత్పత్తులు మానవ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని, పంచగవ్యాలకు ఆధ్యాత్మిక, ఔషధ ప్రాధాన్యం ఉందని వివరించారు. భారతీయ సంస్కృతిలో గోమాతకు అత్యున్నత స్థానం ఉందని, శ్రీకృష్ణుడు గోపాలుడిగా గోవులను మేపాడని, శ్రీరాముడు గోరక్షణకు కట్టుబడ్డాడని, ఛత్రపతి శివాజీ మహారాజు చిన్న వయసులోనే గో సంరక్షణకు కృషి చేశారని గుర్తు చేశారు. వారి ఆదర్శాలను అనుసరించి గో సంరక్షణను ప్రతి పౌరుడు తన బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు. గోవులో ముప్పై మూడు కోట్ల దేవతలు కొలువై ఉంటారని హిందూ విశ్వాసాన్ని ప్రస్తావించిన ఆయన, గోమాతతో పాటు హిందూ దేవాలయాల పరిరక్షణ కూడా ప్రతి ఒక్కరి ధర్మమని పేర్కొన్నారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా అందరూ కలిసి గోమాతకు గౌరవ స్థానం కల్పించే ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో త్రిశక్తి అష్టలక్ష్మి కామాఖ్య దేవాలయం గురువు భవాని సతీష్, హిందూ ఉత్సవ సమితి కార్యదర్శి కర్ణకంటి రవీందర్, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ గోసేవ సంయోజక్ వేముల హరిప్రసాద్, విశ్వనాథ ఆలయ మాజీ చైర్మన్ దొంతుల ముకేశ్, విశ్వహిందూ పరిషత్ జిల్లా గోరక్షక్ ప్రముఖ్ దూట రాజా సమయ్య, రాజేందర్, నాగారపు సంతోష్, మందమర్రి ఉత్సవ సమితి సభ్యులు, సుమారు వంద మంది మహిళా సేవకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## ప్యారమూర్ గ్రామంలో వైద్య శిబిరం

**- సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: సర్పంచ్ వరలక్ష్మి**

**సారంగాపూర్, జులై 27, ప్రభాతవార్త**

మండలంలోని ప్యారమూర్ గ్రామంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం (మెడికల్ క్యాంప్) నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాకునూరి వరలక్ష్మి మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రతి ఒక్కరి ఆరోగ్యం బాగుండాలనే ఉద్దేశంతోనే ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్త చర్యగా వైద్య సిబ్బందితో మాట్లాడి ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేశామని చెప్పారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, గ్రామ ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలన్నదే తమ ఆశయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ వినీత, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్, ఏఎన్ఎం మాధవి, మల్టీపర్పస్ వర్కర్ వినీత, పంచాయతీ కార్యదర్శి మహేందర్ సింగ్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# సీసీ కెమెరాతో దొంగకు చుక్కెదురు..

**క్షణాల్లో గుర్తించిన పోలీసులు - ఫిర్యాదుదారుడిని సన్మానించి అవగాహన కల్పించిన పట్టణ పోలీసులు**



సీసీ కెమెరా ఏర్పాటు చేసిన వ్యక్తిని సన్మానిస్తున్న దృశ్యం




పట్టుకున్న నిందితుడుతో పట్టణ ఇన్స్పెక్టర్, సబ్ ఇన్స్పెక్టర్

**మంచిర్యాల, జూలై 27, ప్రభాతవార్త**

సీసీ కెమెరాలు నేరాల నియంత్రణలో ఎంత కీలక పాత్ర పోషిస్తాయో మరోసారి నిరూపితమైంది. మంచిర్యాల పట్టణంలోని రాజీవ్‌నగర్‌లో జరిగిన కంప్యూటర్ మానిటర్ దొంగతనం కేసును పోలీసులు కేవలం సీసీ కెమెరాల ఆధారంగానే ఛేదించి నిందితుడిని అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, జూలై 25వ తేదీ రాత్రి సుమారు పదకొండు గంటల సమయంలో రాజీవ్‌నగర్‌లో మహమ్మద్ మొఇజ్ నిర్వహిస్తున్న అంతర్జాల సేవల కేంద్రంలోకి ప్రవేశించిన ఓ వ్యక్తి కంప్యూటర్ మానిటర్‌ను అపహరించాడు. ఈ ఘటనపై మరుసటి రోజు ఫిర్యాదు అందుకున్న పట్టణ పోలీసు అధికారులు వెంటనే దర్యాప్తు ప్రారంభించారు. పట్టణ ఎస్సై రమేష్ తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించి, అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల దృశ్యాలను నిశితంగా పరిశీలించారు. వాటి ఆధారంగా బెల్లంపల్లికి చెందిన మహమ్మద్ మద్గం అనే ముప్పై ఒకటేళ్ల వ్యక్తిని నిందితుడిగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నేరం చేసినట్లు అతడు అంగీకరించడంతో, చట్టపరమైన ప్రక్రియ పూర్తి చేసి న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. ఈ సందర్భంగా పోలీసు అధికారి రమేష్ మాట్లాడుతూ, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్లే కేసును అత్యంత వేగంగా ఛేదించడం సాధ్యమైందని తెలిపారు. ప్రతి ఇంటి వద్ద, ప్రతి వ్యాపార సంస్థలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే నేరాలను అరికట్టడంతో పాటు నేరస్తులను సులభంగా గుర్తించే అవకాశం ఉంటుందని ప్రజలకు సూచించారు. అలాగే, దొంగతనం జరిగిన వ్యాపార సంస్థ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పోలీసుల దర్యాప్తుకు తోడ్పడిన మహమ్మద్ మొఇజ్‌ను కాలనీవాసుల సమక్షంలో పోలీసులు ఘనంగా సన్మానించారు. ప్రజల సహకారం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిసి వస్తే నేరాల నియంత్రణ మరింత సమర్థవంతంగా సాగుతుందని పోలీసులు పేర్కొన్నారు.



## గ్రామీణ ప్రతిభను తీర్చిదిద్దడమే ధ్యేయం

**భైంసా, జులై 27, ప్రభాతవార్త:**

గ్రామీణ విద్యార్థులను ప్రపంచ స్థాయి నిపుణులుగా తీర్చిదిద్దడమే ఆర్‌జీయూకేటీ ముఖ్య లక్ష్యమని బాసర ట్రిబుల్ ఐటీ వీసీ ప్రొఫెసర్ కె. గోవర్ధన్ తెలిపారు. సోమవారం క్యాంపస్‌లోని ఎస్ఏసీ ఆడిటోరియంలో పీయూసీ-1 నూతన విద్యార్థుల ఓరియెంటేషన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణ, సాంకేతిక నైపుణ్యాలు అలవరచుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. అనంతరం వివిధ విభాగాల అధికారులు క్యాంపస్ నిబంధనలు, అకాడమిక్ ప్రణాళిక, పరీక్షల విధానం, విద్యార్థుల సంక్షేమంపై నూతన విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావు పటేల్

**భైంసా, జులై 25, ప్రభాతవార్త:**

కొద్దిరోజుల క్రితం పరామర్శకు గురైన డాక్టర్ ముత్యం రెడ్డి తండ్రి మరణించిన విషయాన్ని తెలుసుకుని, ముధోల్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ బోస్లే నారాయణరావు పటేల్ కీని గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ ఛంద్రే, నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బంక బాబు, కుబీర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బషీర్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి రవికుమార్, ఆత్మ డైరెక్టర్ సందీప్, బెంబర్ సర్పంచ్ లక్ష్మణ్, సిరిపెల్లి సర్పంచ్ క్రాంతి రాజ్ చవాన్, జాడి శ్రీనివాస్, పి. శివాజీ, గుడిసెరా సర్పంచ్ భోజరామ్, విలాస్, కామాజి తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఓటర్ సవరణ పూర్తి చేసిన సిబ్బందికి అభినందనలు

**- తహసీల్దార్ విజయ్ కాంతారావు ఆధ్వర్యంలో సత్కారం**

**సారంగాపూర్, జులై 27, ప్రభాతవార్త:**

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసిన సిబ్బందికి, కార్యాలయ ఉద్యోగులకు సారంగాపూర్ తహసీల్దార్ విజయ్ కాంతారావు అభినందనలు తెలిపారు. మండలంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని, ఓటర్ సవరణ కార్యక్రమంలో విశేష సేవలు అందించిన సిబ్బందిని శాలువా కప్పి, మెమొంటోలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఎంతో ఓపిక, బాధ్యతతో పనిచేసి ఓటర్ సవరణ ప్రక్రియను పూర్తి చేసిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిటిఓ రవీందర్, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




# జిల్లాలో పోడు రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా..

## - డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క



**కెరమెరి, జూలై 27, ప్రభాతవార్త:**

అటవీ అధికారులు మానవతా దృక్పథంతో వ్యవహరించి, పోడు రైతుల సాగుకు ఆటంకాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క అన్నారు. కెరమెరి మండలం సుర్ధాపూర్ గ్రామంలో పోడు భూములు సాగు చేసుకుంటున్న రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆత్రం సుగుణక్క సోమవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. పోడు భూముల్లోకి అటవీ అధికారులు వెళ్లనివ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని రైతులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, ఇప్పటికే పోడు భూముల్లో విత్తనాలు వేశామని, ఇప్పుడు ఎరువులు వేయడానికి భూముల్లోకి వెళ్తే అటవీ అధికారులు అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా భూముల చుట్టూ కందకాలు తవ్వడం వల్ల సాగు పనులు పూర్తిగా నిలిచిపోయాయని, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వివరించారు. రైతుల సమస్యలను విన్న సుగుణక్క మాట్లాడుతూ, జిల్లాలో పోడు భూములు సాగు చేస్తున్న రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. సంవత్సరాలుగా సాగు చేస్తున్న భూముల విషయంలో రైతులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. సుర్ధాపూర్ గ్రామ పోడు రైతుల సమస్యను రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకెళ్లి, రైతులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మహమ్మద్ సుజాయిత్ ఖాన్, బోలపటార్ సర్పంచ్ రాథోడ్ మారుతీ, అయూబ్, మహమ్మద్, ఉప్పుల శ్రీనివాస్, గూర్నూలే శంకర్, దొడ్డాజీ, పాలకుర్తి శ్రీనివాస్, శైలని జిలాని, మహబూబ్, శంకర్, నాన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన నూతన సీఐ

**ఆసిఫాబాద్, జూలై 27, ప్రభాతవార్త :**

ఆసిఫాబాద్ పట్టణ నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ)గా బాధ్యతలు స్వీకరించిన నీలం రవి సోమవారం జిల్లా ఎస్పీ నితికా పంత్ను మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీని కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ నూతన సీఐకి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ పారదర్శకంగా విధులు నిర్వహించాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు.

## ఏఐటీయూసీ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

**ఆసిఫాబాద్, జూన్ 27, ప్రభాతవార్త :**

ఏఐటీయూసీ కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్. విలాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా టి దివాకర్, ప్రధాన కార్యదర్శిగా బోగే ఉపేందర్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శిగా ఆత్మకూరి చిరంజీవి ఎన్నికయ్యారు. అదేవిధంగా జిల్లా ఉపాధ్యక్షులుగా కె. రాజగౌడ్, బి.సుధాకర్, కె. మహేష్, జిల్లా కార్యదర్శులుగా ఎల్పుల అశోక్, ఎస్కే షకీర్, జిల్లా కోశాధికారిగా ఎన్. సంతోషి తోపాటు 15 మంది కార్యవర్గ సభ్యులు, 33 మంది జిల్లా కౌన్సిల్ సభ్యులను కూడా ఎన్నుకున్నట్లు ఆయన వెల్లడించారు.



## తుడుం దెబ్బ మండల కమిటీలు ఎన్నిక

**తాండూర్, జూలై 27, ప్రభాతవార్త :**

తాండూర్ మండల తుడుం దెబ్బ, ఆదివాసీ విద్యార్థి మండల కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా అల్లంకొండ భీమన్న, అధ్యక్షులుగా యాపల సమ్మయ్య, ప్రధాన కార్యదర్శిగా బుర్రా ప్రవీణ్, ఆదివాసి విద్యార్థి మండలం అధ్యక్షుడిగా పసుల ధర్మయ్య, ప్రధాన కార్యదర్శి గా ఆలకుంట అంజన్నలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షులు పెంద్రం హనుమంత్, జాతీయ ఉపాధ్యక్షులు ఆడ జంగు, రాష్ట్ర కార్యదర్శి మండిగ రవీందర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గడ్డం మణికుమార్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుర్సెంగ బాబురావు, కార్యదర్శి అరికేల శంకర్, మంగం శ్రీకాంత్, కాసిపేట మండల అధ్యక్షులు, తొమ్మిది తెగల ఆదివాసీ సంఘ నాయకులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ

**తాండూర్, జూలై 27, ప్రభాతవార్త :**



మండలంలోని గోపాల్ నగర్ గ్రామానికి చెందిన తుంగేడ శంకరమ్మ లచ్చన్న దంపతులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులకు సోమవారం స్థానిక సర్పంచ్ గాట్ల నర్సయ్య భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయ్యేలా తన వంతు కృషి చేస్తానన్నారు. గ్రామంలో పక్కా ఇల్లు లేని కుటుంబం ఒక్కటి కూడా లేకుండా చూడటమే తన లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ అభివృద్ధికి ప్రజల సహకారం ఎంతో అవసరమన్నారు. గ్రామంలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి

### - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్, జూలై 27, ప్రభాతవార్త**

వర్షాకాలం దృష్ట్యా మున్సిపల్ పరిధిలోని డివిజన్లు/వార్డులలో పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్యతో కలిసి మున్సిపల్ కమిషనర్లతో అభివృద్ధి పనుల వేగవంతం, పారిశుద్ధ్య పనుల నిర్వహణ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, పారిశుద్ధ నిర్వహణలో ఎలాంటి అలసత్వం లేకుండా పకడ్బందీగా చేపట్టాలని, ప్రతిరోజు ప్రతి ఇంటి నుండి తడి, పొడి చెత్తను సేకరించాలని తెలిపారు. మున్సిపల్ అభివృద్ధిలో భాగంగా చేపట్టిన అంతర్గత రహదారులు, మురుగు కాలువల వ్యవస్థ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేయాలని తెలిపారు. వార్డులలో వీధి దీపాలు లేని ప్రాంతాలను గుర్తించి వెంటనే ఏర్పాటు చేయాలని, దోమల వృద్ధిని నివారించే విధంగా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారుల సమన్వయంతో మున్సిపల్ పరిధిలోని ఆసుపత్రులలో అవసరమైన వైద్య సేవలు, మందులు అందుబాటులో ఉండేలా పర్యవేక్షించాలని తెలిపారు. ప్రజలకు శుద్ధమైన త్రాగునీటిని సరఫరా చేసే విధంగా కార్యాచరణ అమలు చేయాలని, అమృత్ 2.0 పథకం క్రింద చేపట్టిన నీటి ట్యాంకులు, పైప్ లైన్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. నగర అభివృద్ధి నిధులతో కేటాయించిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేసే విధంగా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని తెలిపారు. మున్సిపాలిటీల పరిధిలోని పన్ను బకాయిలను 100 శాతం వసూలు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్ధవంతంగా అమలు చేసేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## అన్ని వర్గాల అభివృద్ధికి కృషి

**ఆసిఫాబాద్, జులై 27, ప్రభాతవార్త :**



అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందని మున్సిపల్ చైర్మన్ ఆకాష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జనకపూర్ పద్మశాలి సంఘానికి మంజూరైన షెడ్డు నిర్మాణ పనులను సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ హైమద్, వైస్ చైర్మన్ అహ్మద్ తో కలసి భూమి పూజ చేశారు. అంతకుముందు మార్కండేయలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఎమ్మెల్యే కోవలక్ష్మి సహకారంతో ఆసిఫాబాద్ పట్టణాన్ని అభివృద్ధి చేయడం జరుగుతుందని ఆకాష్ తెలిపారు. ప్రజల సహకారంతో పట్టణాన్ని అభివృద్ధిపరిచేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ చిలువరి వెంకన్న, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, జనకాపూర్ సంఘం అధ్యక్షుడు భద్రయ్య, నాయకులు గుండా శ్యామ్, శైలేందర్, మహేష్, శంకర్, రాజన్న, సత్యనారాయణ, రవి, గిరి, శ్రీకాంత్, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

## గోమాతను జాతీయ జంతువుగా ప్రకటించాలి

### - కలెక్టర్‌కు 3.42 లక్షల సంతకాల వినతిపత్రం సమర్పణ

**నిర్మల్, జులై 27, ప్రభాతవార్త:**

గోమాతను జాతీయ జంతువుగా ప్రకటించాలని కోరుతూ దేశవ్యాప్తంగా చేపట్టిన సంతకాల సేకరణలో భాగంగా సేకరించిన వినతిపత్రాన్ని సోమవారం నిర్మల్ జిల్లా కలెక్టర్‌కు ప్రతినిధుల బృందం అందజేసింది. సుమారు 300 మంది గోభక్తులు భారీ బైక్ ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకుని వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువల్లో గోమాతకు విశిష్ట స్థానం ఉందన్నారు. గోమాత సంరక్షణ ప్రతి భారతీయుడి బాధ్యత అని, కేంద్ర ప్రభుత్వం వెంటనే గోమాతను జాతీయ జంతువుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. నిర్మల్ జిల్లావ్యాప్తంగా నిర్వహించిన సంతకాల సేకరణకు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని, మొత్తం 3,42,000 మంది సంతకాలు చేసి మద్దతు తెలిపారని వివరించారు. ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించే ఈ వినతిపత్రాన్ని కేంద్ర ప్రభుత్వానికి పంపి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను విజ్ఞప్తి చేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన కలెక్టర్.. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అదేవిధంగా కలెక్టర్ కార్యాలయం సమీపంలో జరుగుతున్న గోవధను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. గోవధకు పాల్పడుతున్న వారిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోభక్తులు, హిందూ సంఘాల నాయకులు, సామాజిక కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# వైద్యులు, ఆరోగ్య సిబ్బంది సమయపాలన తప్పనిసరిగా పాటించాలి

**- మాతా శిశు సంరక్షణ, టీకాల వివరాలను పోర్టల్లలో 100 శాతం నమోదు చేయాలి**

**- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ - జిల్లా వైద్యాధికారులతో వ్యాధుల నివారణపై సమీక్షా సమావేశం**

**నస్పూర్, జూలై 27, ప్రభాతవార్త**



జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, వైద్య సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని, వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున మండల అధికారుల సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ నరేందర్ రాథోడ్ ఆదేశించారు. మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం జిల్లాలోని వైద్యాధికారులతో వైద్య ఆరోగ్య కార్యక్రమాల అమలుపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారీగా సాగుతున్న సేవలపై ఆరా తీస్తూ అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేందర్ రాథోడ్ మాట్లాడుతూ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల్లో భాగంగా మాతా శిశు సంరక్షణ నమోదు 100 శాతం పూర్తి చేయాలన్నారు. గర్భిణులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహిస్తూ, హైరిస్క్ గర్భవతులను గుర్తించి ప్రత్యేక వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ వివరాలను మాతా శిశు సంరక్షణ పోర్టల్లో, టీకాల వివరాలను యువిన్ పోర్టల్లో 100 శాతం నమోదు చేయాలన్నారు. జాతీయ క్షయ వ్యాధి నియంత్రణలో భాగంగా పోర్టబుల్ ఎక్స్‌రేల ద్వారా బాధితులను గుర్తించాలని, మారుమూల ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆశా కార్యకర్తలు నిత్యం గ్రామాలను సందర్శిస్తూ కీటక జనిత వ్యాధులు ప్రబలకుండా సర్పంచులు, పంచాయతీ సిబ్బంది సహకారంతో దోమల నివారణకు పరిసరాల పరిశుభ్రత చేపట్టాలన్నారు. ప్రతి ఇంటా ఓఆర్ఎస్ పాకెట్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. 30 ఏళ్ల పైబడిన వారందరికీ అసంక్రమణ వ్యాధుల నిర్ధారణ పరీక్షలు చేసి బీపీ, షుగర్ మందులను సమయానికి అందజేయాలని సీహెచ్ఓలు, వైద్యాధికారులను ఆదేశించారు. అలాగే ఈఔషధ్, టెలి మనస్ కార్యక్రమాలను 100 శాతం పూర్తి చేయాలని, పాఠశాలల్లో మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని సూచించారు. రెసిడెన్షియల్ పాఠశాలలను వైద్యులు, సూపర్‌వైజర్లు నిరంతరం సందర్శించి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులపై తగు సూచనలు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధాకర్ నాయక్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అరుణశ్రీ, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, సీహెచ్ఓ కాకిరాల వెంకటేశ్వర్లు, డీడీఎం ప్రవళికతో పాటు పలువురు వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులకు సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు

**- మందమర్రిలో డాక్టర్ రెడ్డీస్ ఆధ్వర్యంలో సీఎంఈ సదస్సు**

**మందమర్రి, జూలై 27, ప్రభాతవార్త**

మందమర్రి పట్టణంలోని ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ సంఘ భవనంలో డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్ సౌజన్యంతో కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్ (సీఎంఈ) అవగాహన సదస్సు నిర్వహించారు. సీజనల్ వ్యాధులు, జ్వరాల నివారణ, ప్రాథమిక చికిత్స, ఆధునిక వైద్య విధానాలపై వైద్యులకు అవగాహన కల్పించడం కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు. సదస్సులో ముఖ్య వక్తగా పాల్గొన్న డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జయసుప్రజ మాట్లాడుతూ, సీజనల్ వ్యాధుల లక్షణాలు, నివారణ చర్యలు, ప్రాథమిక చికిత్సలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆధునిక వైద్య విధానాలతో పాటు సంస్థ తయారు చేస్తున్న ఔషధాల నాణ్యత, వినియోగంపై వివరించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు అందిస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులకు ఈ సదస్సు ఎంతో ఉపయోగకరంగా నిలిచిందని పాల్గొన్న వైద్యులు తెలిపారు. మారుమూల ప్రాంతాల్లో ప్రజలకు తొలి వైద్య సేవలు అందించే వైద్యులకు ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు అవసరమని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్ యాజమాన్యానికి, డాక్టర్ జయసుప్రజకు మందమర్రి ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాదాసు శంకరయ్య, మందమర్రి పట్టణ అధ్యక్షుడు గోనె గోవర్ధన్, గౌరవ అధ్యక్షుడు కట్ల శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ మంద తిరుమల రెడ్డి, ప్రధాన కార్యదర్శి అడ్డూరి సాంబమూర్తి, కోశాధికారి వేముల నరసయ్య, ఉపాధ్యక్షులు గాజుల శంకర్, చింతల పోశం, పానుగంటి పరమాత్మ, నర్సింగోజు తిరుపతితో పాటు గోనె సత్యం, మతినికాన్, విజయ్ శర్మ, ఎస్.కె. ఖాన్, గోనె శ్రీనివాస్, తిప్పని శ్రీనివాస్ తదితర ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య

## ఉపాధ్యాయులు నైపుణ్యాభివృద్ధి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

**- మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య**

**హాజీపూర్, జూలై 27, ప్రభాతవార్త**

ఉపాధ్యాయులకు అందిస్తున్న నైపుణ్యాభివృద్ధి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. సోమవారం జిల్లాలోని హాజీపూర్ మండలం ముల్కల్లలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ కార్యక్రమంలో భాగంగా ఫౌండేషన్ పాఠశాలల ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన 3 రోజుల నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమానికి మండల విద్యాధికారి తిరుపతి రెడ్డి తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల అభ్యాస స్థాయిని మెరుగుపరచడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాజ్ఞానం, కార్యాచరణ ఆధారిత బోధన, వినూత్న బోధనా పద్ధతుల అమలుపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతి విద్యార్థిలో నేర్చుకునే సామర్థ్యాన్ని పెంపొందించేలా కృషి చేయాలని తెలిపారు. 2026-27 విద్యా సంవత్సరంలో జిల్లాలో ఎంపికైన ఫౌండేషన్ పాఠశాలల్లో ఎఫ్.ఎల్.ఎం. కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడమే ఈ శిక్షణ ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. పి.జి.ఐ. సూచికలలో మంచిర్యాల జిల్లా రాష్ట్రంలో ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రతి ఉపాధ్యాయుడు బాధ్యతాయుతంగా పని చేయాలని తెలిపారు. 3 రోజులపాటు నిర్వహించే ఈ శిక్షణలో బోధన-అభ్యాస ప్రక్రియను మరింత ప్రభావవంతంగా రూపొందించడం, విద్యార్థులలో ప్రాథమిక నైపుణ్యాలను పెంపొందించడం, తరగతి గది నిర్వహణలో ఆధునిక విధానాలను అమలు చేయడం వంటి అంశాలపై మాస్టర్ ట్రైనర్లు, నిపుణులు సమగ్ర అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎ.ఎం.ఓ. జంబోజు సత్తయ్య, హాజీపూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు సుధారాణి, ఎంఐఎస్ సిబ్బంది, మాస్టర్ ట్రైనర్లు, ఫౌండేషన్ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## గంగాపూర్‌లో ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన

**- ప్రత్యామ్నాయ పంటల సాగు - విత్తన మేళా నిర్వహన**

**రెబ్బెన, జూలై 27,ప్రభాతవార్త :**

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలంలోని గంగాపూర్ రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో కాంటింజెన్సీ ప్రణాళిక, వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కార్యక్రమం, విత్తన మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం ఆలస్యమయ్యే అవకాశం ఉండటంతో పాటు మధ్య మధ్యలో పొడి విరామాలు ఏర్పడే పరిస్థితులు ఉన్నందున రైతులు అధిక నీటి అవసరమయ్యే వరి పంటకు బదులుగా కందులు, పెసర్లు, మినుములు, జొన్నలు, సజ్జలు, రాగులు, నువ్వులు, వేరుశెనగ వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పంటల ఎంపిక చేసుకోవాలని, ధృవీకరించిన విత్తనాలను మాత్రమే వినియోగించాలని, నేల పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలని, నీటి యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా పంట నష్టాలను గణనీయంగా తగ్గించుకోవచ్చని రైతులకు వివరించారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన విత్తన మేళాలో వివిధ పంటలకు సంబంధించిన ధృవీకరించిన విత్తనాల రకాలు, వాటి ప్రత్యేకతలు, సాగు విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు నిర్మించాలని సూచించారు. వర్షపు నీటిని భూగర్భ జలాల్లోకి ఇంకేలా చేయడంలో ఇంకుడు గుంతలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. అలాగే రైతులు తమ పొలాల్లో ఫార్మ్ పాండ్లు ఏర్పాటు చేసుకోవడం ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసుకుని అవసరమైన సమయంలో వినియోగించుకోవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, తహసీల్దార్, మండల వ్యవసాయ అధికారి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల పంచాయతీ అధికారి, అసిస్టెంట్ ఇంజనీర్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, వ్యవసాయ విస్తరణ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు. చివరగా వ్యవసాయ శాఖ అధికారులు రైతులు ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించుకుని, వ్యవసాయ శాఖ సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు.

## విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యలపై అలుపెరుగని పోరాటం

**- టిఎస్ ఎస్టియు జిల్లా అధ్యక్షుడు భట్టారి వెంకటేశ్వర్లు**

**తాండూర్, జూలై 27, ప్రభావతవార్త :**

విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (టీఎస్ ఎస్టియు) అలుపెరుగని పోరాటం చేస్తోందని ఆ సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు భట్టారివెంకటేశ్వర్లు అన్నారు. తాండూర్ మండలంలోని రేచిని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం టీఎస్ ఎస్టియు సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. పలువురు ఉపాధ్యాయులు సంఘం సభ్యత్వాన్ని తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని కొన్ని మండలాలలో 2024 వ సంవత్సరంలో వేసవి కాలంలో జరిగిన ఉపాధ్యాయ శిక్షణ తరగతులకు సంబంధించిన ఈఎల్ లను ఉపాధ్యాయులకు ఇప్పటికీ మంజూరు చేయలేదన్నారు. సంబంధిత ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు దృష్టిసారించి ఈఎల్ లను వెంటనే మంజూరు చేయాలన్నారు. పీఆర్సి నివేదికను ప్రభుత్వం వెంటనే తెప్పించుకొని అమలు చేయాలని కోరారు. పెండింగ్ లో ఉన్న డిఏ లు, బిల్లులను వెంటనే విడుదల చేయాలని, సిపిఎస్ ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. ఉపాధ్యాయులు టీఎస్ ఎస్టియులో సభ్యత్వం తీసుకొని సంఘాన్ని బలోపేతం చేసి ఉపాధ్యాయ సమస్యలపై మరింతగా పోరాటం చేసేందుకు బలం చేకూర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవిబాబు, కృష్ణ గౌడ్, రాజేంద్రప్రసాద్, సంతోష్, శ్రీనివాస్, మధుకర్, శ్రీలత, సుకుమాంజలి తదితరులు పాల్గొన్నారు.





డాక్టర్ ప్రసన్న కుమార్ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

## పర్యావరణ పరిరక్షణకు జీవితాన్నే అంకితం చేసిన మహోన్నత సేవలకు ఘన సత్కారం

**- రాష్ట్రవ్యాప్తంగా అధికారుల సమక్షంలో వైభవంగా ఉద్యోగ విరమణోత్సవం**

**- సేవలను కొనియాడిన శ్రేయోభిలాషులు**

**మంచిర్యాల, జూలై 27, ప్రభాతవార్త**

పర్యావరణ పరిరక్షణ, పర్యావరణ అవగాహన, విద్యా వికాసానికి విశిష్ట సేవలు అందించిన రాష్ట్ర గ్రీన్ కోర్ డైరెక్టర్ డాక్టర్ ప్రసన్నకుమార్ ఉద్యోగ విరమణోత్సవాన్ని హైదరాబాద్‌లోని కాలుష్య నియంత్రణ మండలి ఆడిటోరియంలో పర్యావరణహితంగా, ఘనంగా నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి అధికారులు, పూర్వ అధికారులు, శ్రేయోభిలాషులు హాజరై ఆయన సేవలను కొనియాడారు. పర్యావరణ పరిరక్షణలో డాక్టర్ ప్రసన్నకుమార్ చేసిన కృషి రాష్ట్రానికే కాకుండా దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచిందని, అనేక మంది యువతకు ఉన్నత ఉద్యోగాల సాధనలో మార్గదర్శకులుగా నిలిచారని వక్తలు ప్రశంసించారు. ప్లాస్టిక్ రహితంగా, ప్రకృతి హిత విధానాలతో నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమ విజయవంతంలో మంచిర్యాల జిల్లా పూర్వ గ్రీన్ కోర్ సమన్వయాధికారి గుండేటి యోగేశ్వర్ కీలక పాత్ర పోషించారు. రాష్ట్రవ్యాప్తంగా అధికారులను సమన్వయం చేయడంతో పాటు ప్రత్యేక సన్మాన పత్రాన్ని రూపొందించి విశేష సేవలందించారు. ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, రాష్ట్ర గ్రీన్ కోర్ ప్రాజెక్టు అధికారులు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధులు, పలువురు విద్యా, ప్రభుత్వ శాఖల అధికారులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

## ముల్కల్ల మల్లారెడ్డికి బీజేపీ ఘన నివాళి

**అకాల మరణం పార్టీకి తీరని లోటు - రఘునాథ్ వెరబెల్లి**

**మంచిర్యాల, జూలై 27, ప్రభాతవార్త**

భారతీయ జనతా పార్టీ మంచిర్యాల జిల్లా మాజీ అధ్యక్షులు, మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముల్కల్ల మల్లారెడ్డి అకాల మరణం పార్టీకి తీరని లోటని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. మల్లారెడ్డి ఇటీవల పరమపదించడంతో మంచిర్యాల జిల్లా బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సంతాప సభలో ఆయన పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లారెడ్డి చిన్న వయసులోనే విద్యాసంస్థలను స్థాపించి వేలాది మంది విద్యార్థులకు విద్యాబోధన అందించి వారి జీవితాలకు వెలుగులు నింపారని కొనియాడారు. పార్టీ బలోపేతానికి విశేష కృషి చేసి జిల్లాలో బీజేపీ అభివృద్ధికి ఎనలేని సేవలు అందించారని పేర్కొన్నారు. వారి సేవలను పార్టీ ఎల్లప్పుడూ స్మరించుకుంటుందని, వారి కుటుంబానికి బీజేపీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. సభలో పెద్దపల్లి మాజీ ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేత, రాష్ట్ర నాయకులు గోమాసే శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చందుపట్ల సునీల్ రెడ్డి, పురుషోత్తం జాజు, పెద్దపల్లి పురుషోత్తం, కొయ్యల ఎమాజీ, గాజుల ముఖేష్ గౌడ్, వంగపల్లి వెంకటేశ్వర్ రావు, ఎనగందుల కృష్ణమూర్తి, ఆకుల అశోక్ వర్ధన్, పచ్చ స్వప్న రాణి, గోపతి రాజయ్య, ప్రేమ్ సింగ్‌తో పాటు రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొని మల్లారెడ్డికి ఘనంగా నివాళులర్పించారు.



# ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీపై ప్రజావాణిలో ఫిర్యాదు

**కాగజ్‌నగర్ రూరల్, జూలై 27, ప్రభాతవార్త :**



జిల్లాలో ఎలాంటి పత్రికా ప్రకటన లేకుండా విద్యాశాఖలో ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ అయిన శివ బాలాజీ కన్సల్టెన్సీ ద్వారా కంప్యూటర్ ఆపరేటర్ల నియామకాలు చేపడుతున్నారంటూ విద్యార్థి నిరుద్యోగ జేఏసీ జిల్లా కన్వీనర్ పొన్న రమేష్ ఆధ్వర్యంలో నిరుద్యోగులు సోమవారం ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పొన్న రమేష్ మాట్లాడుతూ.. కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన డిగ్రీలో కంప్యూటర్ సబ్జెక్టు చదివినవారు, డిగ్రీతో పాటు పీజీడీసీఏ, డిగ్రీ అనంతరం ఒక సంవత్సరం కంప్యూటర్ డిప్లొమా, బీటెక్ చదివిన పలువురు నిరుద్యోగులు ఉన్నారని తెలిపారు. అయితే జిల్లాలో ఎలాంటి పత్రికా ప్రకటన జారీ చేయకుండా, జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా ఉపాధి మరియు శిక్షణ అధికారి, జిల్లా కలెక్టర్ ప్రమేయం లేకుండా ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ ఆపరేటర్లను నియమిస్తున్నారని ఆరోపించారు. ఈ నియామక ప్రక్రియలో పారదర్శకత లోపించడమే కాకుండా, పలు అనుమానాలకు తావిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా ఉద్యోగాల భర్తీ చేపట్టే సమయంలో ప్రభుత్వ నియామక పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన అభ్యర్థులకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు. నాలుగో తరగతి ఉద్యోగ నియామక పరీక్షలు రాసి ఉద్యోగాలు పొందలేకపోయిన అభ్యర్థుల్లో మెరిట్ ఆధారంగా తదుపరి ర్యాంకర్లకు అవకాశం కల్పించాలని సూచించారు. అలాగే వైద్య విధాన పరిషత్ పరీక్షల్లో మెరిట్ ఆధారంగా పారామెడికల్ సిబ్బంది నియామకాలు, గురుకుల నియామకాల్లో మెరిట్ ఆధారంగా పార్ట్‌టైమ్, అతిథి ఉపాధ్యాయుల నియామకాలు, పోలీస్ నియామక ప్రక్రియలో మెరిట్ ఆధారంగా హోంగార్డుల నియామకాలు చేపట్టిన విధంగా, ప్రభుత్వం నిర్వహించే నియామక పరీక్షల్లో మెరిట్ ఆధారంగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలను భర్తీ చేస్తే వివాదాలకు, అనుమానాలకు తావు ఉండదని తెలిపారు. ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలపై ప్రభుత్వ నియంత్రణ ఉండాలని, నియామక ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని పొన్న రమేష్ అధికారులను విజ్ఞప్తి చేశారు.

## బారేగూడను అన్ని రంగాల్లో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తా

**- సర్పంచ్ కోట వేణుగోపాల్**

**- వినతిపత్రం నుంచి విజయం వరకు.. సర్పంచ్ కృషికి ఫలితం!**

**- బారేగూడ, శివాపూర్‌లో 25 కేవీ సామర్థ్యంతో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు**

**కాగజ్‌నగర్ రూరల్, జూలై 27, ప్రభాతవార్త :**



గ్రామంలో దీర్ఘకాలంగా నెలకొన్న విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా బారేగూడ గ్రామ సర్పంచ్ కోట వేణుగోపాల్ చేసిన నిరంతర కృషి ఫలించింది. గత కొంతకాలంగా తక్కువ వోల్టేజీ, తరచూ విద్యుత్ అంతరాయం, లోడ్ పెరగడం వల్ల గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వేసవి కాలంలో విద్యుత్ వినియోగం పెరగడంతో ఇళ్లలో పరికరాలు సరిగా పనిచేయకపోవడం, వ్యవసాయ మోటార్లకు సరైన విద్యుత్ అందకపోవడం వంటి సమస్యలు ఎక్కువయ్యాయి. ఈ సమస్యలను పరిష్కరించేందుకు సర్పంచ్ కోట వేణుగోపాల్ గత జూన్ 8న జిల్లా కలెక్టర్‌ను కలిసి సమగ్ర వినతిపత్రం సమర్పించారు. గ్రామంలో నెలకొన్న పరిస్థితులను వివరించి, తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం విద్యుత్ శాఖ అధికారులతో నిరంతర సమన్వయం కొనసాగిస్తూ సమస్య తీవ్రతను వివరించారు. సర్పంచ్ చేసిన ప్రయత్నాల ఫలితంగా 25 కేవీ సామర్థ్యం గల రెండు కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరయ్యాయి. మంజూరైన ట్రాన్స్‌ఫార్మర్లలో ఒకటి బారేగూడ గ్రామంలో, మరొకటి శివాపూర్‌లో ఏర్పాటు చేశారు. ఈ కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ద్వారా విద్యుత్ సరఫరా స్థిరంగా మారి, తక్కువ వోల్టేజీ సమస్యకు గణనీయమైన ఉపశమనం లభించనుంది. అలాగే అధిక లోడ్ కారణంగా తరచూ ట్రిప్ అవుతున్న సమస్యలు కూడా తగ్గనున్నాయి. గ్రామ ప్రజలు ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తూ సర్పంచ్ కృషిని అభినందిస్తున్నారు. అంతేకాకుండా గ్రామంలో విద్యుత్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి సర్పంచ్ సమగ్ర ప్రణాళికను సిద్ధం చేశారు. వదులుగా ఉన్న ప్రమాదకర విద్యుత్ తీగలను తొలగించడం, అవసరమైన చోట కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటు, అదనపు స్తంభాల మంజూరు, అలాగే కొత్త విద్యుత్ లైన్ల విస్తరణ వంటి పనులకు సంబంధించిన ప్రతిపాదనలను విద్యుత్ శాఖతో కలిసి రూపొందించి స్థానిక ఎమ్మెల్యేకు అందజేశారు. నిధులు మంజూరైన వెంటనే ఈ పనులను వేగంగా పూర్తి చేసి బారేగూడ గ్రామపంచాయతీ పరిధిలో విద్యుత్ సమస్యలు పూర్తిగా లేకుండా చేస్తామని సర్పంచ్ కోట వేణుగోపాల్ తెలిపారు. ప్రతి ఇంటికీ సురక్షితమైన, నాణ్యమైన, నిరంతర విద్యుత్ అందించడమే తన ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. గ్రామాభివృద్ధి, ప్రజల సంక్షేమమే తన ధ్యేయమని పేర్కొన్న సర్పంచ్, ప్రజల సహకారంతో బారేగూడను అన్ని రంగాల్లో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## బాధితులకు ఎల్లవేళలా అండగా ఉంటాం: ఎమ్మెల్యే

**- ఎల్.ఓ.సి చెక్కు అందజేసిన ఎమ్మెల్యే**

**నిర్మల్, జులై 27, ప్రభాతవార్త:**



అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని నిర్మల్ ఎమ్మెల్యే, అసెంబ్లీ ప్రతిపక్ష ఫ్లోర్ లీడర్ ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలిపారు. నిర్మల్ రూరల్ మండలం చిట్యాల్ గ్రామానికి చెందిన బోంపాల రాహుల్ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో తీవ్ర అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. ఆయన వైద్య సహాయార్థం మంజూరైన రూ. 3 లక్షల విలువైన ఎల్.ఓ.సి (లెటర్ ఆఫ్ క్రెడిట్) చెక్కును ఎమ్మెల్యే సోమవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత నెల రోజుల్లోనే రాహుల్ రెండుసార్లు నిమ్స్‌లో చికిత్స పొందారని, ఎల్.ఓ.సి ద్వారా ఇప్పటివరకు మొత్తం రూ. 6.50 లక్షల ఆర్థిక సహాయం మంజూరైందని వెల్లడించారు. ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్యశ్రీ, ఎల్.ఓ.సి పథకాల ద్వారా పేదలు వైద్యం కోసం ఆర్థికంగా ఇబ్బంది పడకుండా సహాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆపద సమయంలో తక్షణమే స్పందించి అండగా నిలిచిన ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## సమాచార హక్కు సాధన కమిటీ జాతీయ కార్యదర్శిగా తోట శ్రీనివాస్

**- పారదర్శక పాలన, ప్రజల్లో అవగాహన పెంపే లక్ష్యమని నాయకుల ఆకాంక్ష**

**మంచిర్యాల, జూలై 29, ప్రభాతవార్త**



సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ చైర్మన్ డాక్టర్ చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో జాతీయ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుల ఏకగ్రీవ నిర్ణయంతో తోట శ్రీనివాస్‌ను జాతీయ కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. సమాచార హక్కు చట్టం పరిరక్షణ, ప్రజల్లో అవగాహన పెంపు, పారదర్శక పాలన, జవాబుదారీతనం, అవినీతి నిర్మూలన దిశగా తోట శ్రీనివాస్ సమర్థవంతంగా సేవలందిస్తారనే విశ్వాసంతో ఈ బాధ్యతలు అప్పగించినట్లు నాయకులు తెలిపారు. జాతీయ చైర్మన్ డాక్టర్ చంటి ముదిరాజ్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా సమాచార హక్కు ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయడంలో తోట శ్రీనివాస్ కీలక పాత్ర పోషిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం, జాతీయ సహాయ కార్యదర్శి అన్నవరం సందీప్ రెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు చింతల రాఘవేందర్, రాష్ట్ర కో కన్వీనర్ గడప కృష్ణతో పాటు పలువురు జాతీయ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.